క్లుప్తంగా

జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక



ఎల్కతుర్తి : మండల కేంద్రానికి చెందిన మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్.స్వర్ణలత జాతీయ స్థాయి (ఎస్‌హెచ్‌జీ) 2024 అవార్డుకు ఎంపిక అయ్యారు. నవంబర్ 22వ తేదీన హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి సదస్సులో ఈ అవార్డును అందుకోనున్నారు. భారతదేశంలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన (ఎస్‌హెచ్‌జీ) సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళా సమాఖ్య నుంచి (ఏపీ ఎంఏఎస్) ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సంస్థ, ఎస్బీఐ, ఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూబీ. ఎనేబుల్ నెట్‌వర్క్, ప్రధాన్ డీజీఆర్వీ జర్మన్ సంస్థలు సంయుక్తంగా మూడేళ్లుగా ప్రతీ సంవత్సరంలో జాతీయస్థాయిలో నామినేషన్లు స్వీకరించి బహుమతులు అందిస్తున్నాయి. ఈ మేరకు సమాఖ్య పనితీరు, అందిస్తున్న సేవలు, వనరులు, ఆస్తుల నిర్వహణ, వాటి నాణ్యత, సమావేశాలు, హాజరు, రుణాల స్వీకరణ, చెల్లింపులు, పొదుపు, సభ్యుల పనితీరు, స్వయం సమృద్ధి సాధనలో సాధించిన లక్ష్యాలను ప్రామాణికంగా తీసుకొని ఎంపిక చేసినట్లు ఏపీఎం రవీందర్ తెలిపారు.

క్రియేటివ్ కరాటేలో విద్యార్థులు ప్రతిభ



పరకాల : కాజీపేటలో విక్టరీ షాటోకాల్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన క్రియేటివ్ కరాటేకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జూనియర్ బాలుర గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను సాయితేజ కైవసం చేసుకోగా జూనియర్ బ్రౌన్ బెల్ట్ సబ్ జూనియర్ విభాగంలో గుత్తికొండ చేతన్, జూనియర్ బాలికల స్పారింగ్ విభాగంలో జి.శ్రేష్ట బంగారు పతకాలు, ఎస్. శ్రావ్య వెండి పతకం సాధించినట్లు క్రియేటివ్ కరాటే డోకు వ్యవస్థాపకుడు మాడ సంపత్ తెలిపారు. కరాటే సబ్ జూనియర్ బాలికల స్పారింగ్ విభాగంలో ఎం.అనన్య, ఎం.డీ హుజేర బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. విజేతలను ఆ క్లబ్ అధ్యక్షుడు సోదా రామకృష్ణ, షిటోరియ రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి పాపయ్య అభినందించారు.

మత్స్య సంఘం అధ్యక్షుడిగా మురళీకృష్ణ



కమలాపూర్ : మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా మౌటం మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మౌటం నిరంజన్, డైరెక్టర్లుగా మౌటం లక్ష్మయ్య, మౌటం భిక్షపతి, మౌటం కుమారస్వామి, బండి కొమురయ్య, జంగిలి సాంబయ్య, మౌటం రమేశ్, గందసిరి భిక్షపతి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు గందసిరి కొమురయ్య, సమ్మయ్య, డాక్టర్ కుమారస్వామి, మౌటం శ్రీనివాస్, బండి రవి, గందసిరి రవికుమార్, కొండ మొగిలి, సంఘ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఆర్థికసాయం అందజేత



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన అంచె చిలుకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబానికి అందించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం రవి రూ.5 వేలు స్థానిక పద్మశాలీలకు పంపించారు. ఈ మేరకు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రవి పంపించిన నగదును అందించారు. మాజీ ఎంపీటీసీ రాధిక, పద్మశాలి సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, సభ్యులు ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

ఆత్మకూరు : ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ తెలిపారు. మండలంలోని కటాక్షపూర్‌లో మతిస్థిమితం సరిగా లేని ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు సోమవారం అత్యాచారానికి పాల్పడ్డాడు. సదరు యువతి ఈ విషయాన్ని తల్లికి తెలిపింది. దీంతో ఆమె తల్లి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

శాయంపేట : మండల కేంద్రం మీదుగా పెద్దపూర్-వరంగల్‌కు బస్ సర్వీస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు దళిత సంఘం నాయకుడు సుధాకర్ సోమవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

లక్షలు వెచ్చించి..లక్షణంగా వదిలేసి



పునాదులకు పరిమితమైన హెల్త్‌సబ్‌సెంటర్ భవన నిర్మాణం



అసంపూర్తిగా కిచెన్‌షెడ్డు భవన నిర్మాణం

- ముందుకు సాగని హెల్త్‌సెంటర్, కిచెన్‌షెడ్ల నిర్మాణ పనులు
- ఏళ్లు గడుస్తున్నా లేని కదలిక
- త్వరగా పూర్తిచేయాలి స్థానికుల డిమాండ్

ఆత్మకూరు : గ్రామాల అభివృద్ధితో పాటు స్థానికులకు సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంగా మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలంలో గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రం (హెల్త్ సబ్‌సెంటర్) భవన నిర్మాణానికి పునాదులు వేసింది. కానీ సంవత్సరాలు గడుస్తున్నా ఈ భవన నిర్మాణం ముందుకు కదలడం లేదు. ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ పాఠశాల భవనాన్ని కూల్చివేసి స్థలాన్ని సబ్‌సెంటర్ నిర్మించేందుకు అప్పగించారు. కాగా సబ్‌సెంటర్ నిర్మాణం కూడా ఇప్పటి వరకు పూర్తికాకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగిస్తూ పాఠశాలను తొలగించారు. అయితే సబ్‌సెంటర్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో కిచెన్‌షెడ్..

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు కిచెన్‌షెడ్‌ను ప్రారంభించారు. ఇక్కడఉన్న పాఠశాల పాత భవనం గదులను కూల్చివేసి కిచెన్‌షెడ్ నిర్మాణం ప్రారంభించారు. రెండు సంవత్సరాలు కావస్తున్నా దానిని పూర్తి చేయలేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



కమలాపూర్ : ధాన్యం తూకం వేస్తున్న అధికారులు

కమలాపూర్ : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి జాలి లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని గుండేడు, మర్రిపల్లి గూడెం, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాల్లో సెర్ప్ (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నారాయణ, సీసీలు శ్రీదేవి, మహేందర్, సదాలక్ష్మి, మమత, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

ఆత్మకూరు : బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పరకాల నియోజకవర్గంలో గల 239 బూత్‌లల్లో బూత్ కమిటీలను నియమించాలంటే రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు పూర్తిచేయాలన్నారు. క్రియాశీలకంగా వ్యవహరించాలకునే కార్యకర్తలు సమారు 100 సభ్యత్వాలు చేయాలన్నారు. బూత్ కమిటీలు బలంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. సభ్యత్వ నమోదు నవంబర్ 5 వరకు పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, సత్యనారాయణరావు, సభ్యత్వ ప్రముఖ్ ఆర్‌పీ.జయంత్‌లాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, గురిజాల శ్రీరామ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మండల కార్యదర్శి పైడి, రవి పాల్గొన్నారు.

చర్చిల అభివృద్ధికి నిధులు కేటాయిస్తా

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

ఐనవోలు : పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు కోరిన విధంగా చర్చిల అభివృద్ధికి సీడీఎఫ్ నిధులు కేటాయిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. మండలంలోని పున్నేలు గ్రామంలో సోమవారం మిషన్ ఇండియా క్యాంపస్‌లో నియోజకవర్గ క్రిస్టియన్ పాస్టర్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో పాస్టర్స్ ఐక్యవేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పాస్టర్స్ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కాగా ఎమ్మెల్యే నాగరాజుకు పాస్టర్స్ ఐక్యవేదిక కమిటీ సభ్యులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన ఆయన పలు అంశాలను ప్రస్తావిస్తూ హామీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ అధికారి కూచిపూడి బాబురావు, అధ్యక్షుడు అశోక్‌పాల్, జనరల్ సెక్రటరీ రవిపాల్, కోశాధికారి మార్క్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని నందనం గ్రామానికి చెందిన దొనికెన కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణమూర్తి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా పిట్టల సాయిలు ఇటీవల మృతిచెందగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

పరకాల : గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మీ లబ్ధిదారులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మొదటి ప్రధాన్యత ఇవ్వాలని ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు నాగెల్లి సురేష్ కోరారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు సంధర్భంగా ఆయనను కలిసిన సురేష్.. ఈ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు.

నివాళులర్పించిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన దొనికెన కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములుతో కలిసి కృష్ణమూర్తి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థినులకు నాప్కిన్ల పంపిణీ

హసన్‌పర్తి: జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులకు నాప్కిన్లను సోమవారం పంపిణీ చేశారు. హసన్‌పర్తి మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బుచ్చన్న పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన

కేయూ క్యాంపస్: సికింద్రాబాద్ మెహిదీపట్నం గారిసన్ మైదానంలో ఈనెల 16నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన ఐజీసీ ఆర్‌డీసీ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేడెట్లు వెంకటేశ్వర్లు, దినేష్, నవీన్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. వారిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సోమవారం అభినందించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి, ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిరంతరం పెట్రోలింగ్ చేయాలి

హసన్‌పర్తి: శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సూచించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో కవాతు నిర్వహించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట శ్వేతార్కుడికి నెయ్యితో అభిషేకం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారికి అర్చకులు సోమవారం నెయ్యితో అభిషేకం నిర్వహించారు. నెయ్యితో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు సాయికృష్ణ శర్మ అభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సదానందం పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న ఉప్పల శివ

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో గల బాలికల ఎస్సీ హాస్టల్ శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుందని, వెంటనే నూతన భవనం నిర్మించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ) నాయకుడు ఉప్పుల శివ డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన బాలికల హాస్టల్‌ను సోమవారం డీఎస్‌ఏ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, హాస్టల్ కిటికీల నుంచి పాములు లోనికి వస్తున్నాయని అన్నారు. కిటికీలకు జాలీలు కూడా లేవన్నారు. మరుగుదొడ్లకు డోర్లు లేకపోవడంతో విద్యార్థినులు తమ స్నేహితురాళ్ల ఇళ్లకు వెళ్లి స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. హాస్టల్‌లో రెండు బోర్లు ఉన్నప్పటికీ అవి పని చేయడం లేదన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని, అంతవరకు హాస్టల్‌ను అద్దె భవనంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. డీఎస్‌ఏ నాయకులు శ్రావణ్, గణేశ్, శివ పాల్గొన్నారు.

ఐఆర్‌డీఏఐ విధానాలను నిరసిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు



నయీంనగర్: ధర్నా చేస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

వరంగల్: ఇన్సూరెన్స్ నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) విధానాలకు వ్యతిరేకంగా ఎల్‌ఐసీ ఏజెంట్లు భోజన విరామం సమయంలో సోమవారం గేట్ ధర్నా నిర్వహించారు. ములుగురోడ్డు సమీపంలోని కార్యాలయంలో జరిగిన ధర్నాకు డివిజన్ అధ్యక్షులు వైవి.కృష్ణారావు, పులి సుధాకర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. పెంచిన ప్రీమియం రేట్లను తగ్గించాలని, కమీషన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అశోక్, శ్రీనివాస్, రాజిరెడ్డి, రవీంద్రరావు, సతీష్, శ్రీనివాసచారి, సత్యనారాయణ, తిరుపతి, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, వీరస్వామి, తిరుపతిరెడ్డి, రవి బాబు, ప్రతిమ, సునీత, శ్రావణి, రజనీ, సరిత పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాధర్నా

నయీంనగర్: తమ సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ జీవిత బీమా సంస్థ ఏజెంట్లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎల్‌ఐసీ బ్రాంచ్ ఎదుట భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఏజెంట్లు సోమవారం మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో లియాఫీ నాయకులు కుసుమ సత్యనారాయణ, వాసిరెడ్డి అప్పారావు, రాచకొండ వెంకటేశ్వర్లు, కాలే యాదగిరి, కేదారి, మొగిలి, ఉపేంద్రం, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసం పరితపిస్తాం

- ఎస్సై ప్రమోద్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్సై ప్రమోద్‌కుమార్

శాయంపేట : ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీస్‌శాఖ పరితపిస్తూ 24 గంటలు విధులు నిర్వహిస్తోందని ఎస్సై ప్రమోద్‌కుమార్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పోలీస్ జాగృతి కళాబృందం సభ్యులు అమరవీరులకు సంతాపం తెలియజేస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నక్సలైట్ల అణచివేతలో ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోయి అమరులయ్యారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాజాత సభ్యులు నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, రత్నాకర్, విక్రం, నారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జూడో దినోత్సవం



క్రీడాకారులతో జూడో సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ భవన్‌లో ప్రపంచ జూడో దినోత్సవాన్ని సోమవారం జరుపుకొన్నారు. వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఒలింపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ హాజరై మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణ, నిత్య సాధనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని, అప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 240 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జూడో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు దుపాకీ సంతోష్, పొడాల రామయ్య, పీఈటీల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శీలం పార్థసారథి, కమలాకర్, జూడో కోచ్‌లు నాయకపు నాగరాజు, సీహెచ్ రాము పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితంగా పోరాడాలి



వంగేటి అశోక్‌తో హనుమకొండ, వరంగల్ జిల్లా, మండల కమిటీ నాయకులు

ఐనవోలు : సమస్యల పరిష్కారానికి ఆర్యవైశ్యులు సంఘటితంగా పోరాడాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో అభిషేకాది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌కుమార్‌కు నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ నియామక పత్రాన్ని అందించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు తాటికొండ కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు అర్ధగూడి సతీష్, కార్యదర్శి పబ్బతి సత్యనారాయణ, జిల్లా, మండల నాయకులు మోహన్‌రావు, కార్యదర్శి శ్రీరాంరవీందర్, శ్రీనివాస్, మురళి, రఘు, మునీందర్, సదానందం, సంపత్ పాల్గొన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు, కమిటీ సభ్యులు టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావును కలిశారు.

గురుకుల కళాశాల భవనాన్ని మార్చాలి

హన్మకొండ అర్బన్: శిథిలావస్థకు చేరిన హంటర్ రోడ్డులో గురుకుల డిగ్రీ కళాశాల అద్దె భవనంలో నుంచి ఇంకో భవనంలోకి కళాశాలను మార్చాలని, లేకుంటే సొంత భవనం నిర్మించాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ జాయింట్ కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డికి జిల్లా కార్యదర్శి డి.తిరుపతి సోమవారం వినతిపత్రం అందజేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

బాలసముద్రంలో సర్వే నంబర్ 1066లో 50 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని అంబేడ్కర్ నగర్ బస్తీ కమిటీ నాయకులు తెలిపారు. ఈమేరకు డీఆర్‌ఓ వైవీ.గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. చంద్రమౌళి, స్వామి, రఘు, కృష్ణ, సంపత్, రమేష్, సుధాకర్, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్య తీసుకోవాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాంసుందర్‌పై చర్య తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

పంటలసాగుపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న రాజిరెడ్డి

ధర్మసాగర్ : మండలంలోని ధర్మపురం గ్రామంలో వినూత్న లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ రకాల పంటలసాగుపై సచనలు, సలహాలు ఇచ్చి పంటసాగును ప్రోత్సహించే విధంగా రైతులకు బహుమతులు అందించారు. వినూత్న లైన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, ధనలక్ష్మి, జానకి, గోపాల్‌రెడ్డి, సంతోష, అనిత, సృజన, క్లబ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం



స్వర్ణోత్సవ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామన్నపేట: ఆర్యవైశ్య ఉన్నత పాఠశాలలో 1973 – 1974లో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని కీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వర్ణోత్సవ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అందరు ఒకచోట చేరుకుని నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన ఆనందకరమైన సన్నివేశాలను నెమరువేసుకున్నారు. చాలా ఏళ్ల తరువాత స్నేహితులందరూ ఒకేచోట కలుసుకోవడంతో ఒకరినొకరు హత్తుకున్నారు. అనంతరం మృతిచెందిన గురువులు, మిత్రులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో గురువులు నరసింహాచార్యులు, పూర్వ విద్యార్థులు యాదా విద్యాసాగర్, శివ వెంకటేశ్వరరావు, పీపీ నాగరాజు, శివకుమార్, మధుసూదన్, సురేష్, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల గుట్టపైకి రోడ్డు మార్గం



వరంగల్: వరంగల్‌లోని గోవిందరాజుల గుట్ట దేవస్థానం పైకి రోడ్డు మార్గం నిర్మించేందుకు ప్రసాద పథకంలో నిధులు మంజూరు చేయనున్నట్లు తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారని స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు కార్పొరేటర్ ఆధ్వర్యంలో అయ్యవార్లు, మున్సిపల్ వర్కర్లు, స్థానికులు కలిసి శ్రమదానంతో చెట్ల పొదలు, బండరాళ్లను సోమవారం తొలగించారు. ప్రస్తుతం దేవాలయానికి వెళ్లాలంటే మెట్ల మార్గమే ఉందని, రోడ్డు రూపొందిస్తే నడక దారి ఏర్పాటుతో పాటు వాహనాలు సైతం పైకి వెళ్లేందుకు వీలుగా ఉంటుందని కార్పొరేటర్ తెలిపారు. దేవస్థానం అయ్యగార్లు, ముదిరాజ్ పెద్దలు చింతాకుల సునీల్, సాగర్, నాయకులు యాకయ్య, రాజు, చందర్, మహేష్, వాణి, సరిత, జవాన్లు పాల్గొన్నారు.